ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 28 జనవరి 2026

## పురాతన ఆలయాల పునరుద్ధరణ

**- ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శివయ్య**

**గాలివీడు, జనవరి 27(ప్రభాతవార్త):**



గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన ఆలయాల పునరుద్ధరణకు దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు తీసుకుంటున్నదని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శివయ్య పేర్కొన్నారు. మంగళవారం నూలివీడు నక్కలవాండ్లపల్లి రామాలయం, గాలివీడు పెద్దూరులోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం, ఎగువగొట్టివీడు లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాల్లో గర్భగుడి ధ్వజస్తంబం ఉన్న ఆలయాలకు దూపదీప నైవేద్య పథకం వర్తిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి విద్యార్థికి బంగారు పథకం

**లక్కిరెడ్డిపల్లి జనవరి 28 ప్రభాతవార్త**



ఈనెల 22 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని అలీబాగ్ లో జరిగిన నేషనల్ ఫీల్డ్ ఇండోర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ లో లక్కిరెడ్డిపల్లి ఈడిగాపల్లెకు చెందిన చింతామణి అభినయ్ ఆంధ్రప్రదేశ్ తరఫున అర్చరి ఛాంపియన్షిప్లో పాల్గొని రెండు బంగారు పతకాలు ఒక రజక పథకం సాధించారు అండర్ 19 కాంపౌండ్ విభాగం నందు బంగారు పతకం అండర్ 19 టీం విభాగం నందు బంగారు పతకం మరియు అండర్ 14 కాంపౌండ్ 5 స్మార్ట్ విభాగం నందు రజిత పథకం సాధించినట్లు విద్యార్థి తండ్రి తెలిపారు మొత్తం రెండు బంగారు పతకాలు ఒక రజిత పథకం సాధించినట్లు ఆయన తెలిపారు ఇతని ప్రోత్సహించిన గురువు చెన్నకేశవులు తండ్రి హరి ఈడికి పల్లె గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు

# రీసర్వే పనులను చురుగ్గా చేపట్టాలి..

**కడప, జనవరి 27 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్చీకరణ, రీ సర్వే పనులను.. జిల్లాలో ప్రణాళిక ప్రకారం చురుగ్గా చేపట్టాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి.. భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు జేసీ నిధి మీనా హాజరయ్యారు. సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి విసి ముగిసిన అనంతరం.. జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో విసి ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న రీసర్వే పూర్తి చేయాల్సిన గ్రామాలను.. ప్రతి నెలా ప్రతి నియోజకవర్గానికి 2 గ్రామాలను ప్రతినెలా 3వ వారంలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్ లో భాగంగా సేల్, సబ్ డివిజన్, జాయింట్ ఎల్పిఎం తదితర వ్యక్తిగత వివరాలలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేలా.చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అలాగే.. భూ సమస్యలపై పిజిఆర్ఎస్ ద్వారా అందే అర్జీల పట్ల.. సదరు అర్జీ ప్రాథమిక పరిశీలన దశలో ఉన్నట్టు సమాచారం అర్జీదారులకు అందించడం బాధ్యతగా చేపట్టాలన్నారు. ఈ విసి కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల నుండి ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, చిన్నయ్య లు హాజరవ్వగా కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వే శాఖ ఈడి శాంతరాజు, సంబంది సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ధృవపత్రాలతో పాస్‌పోర్ట్ మోసం

### నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష.

**రాయచోటి కోర్టు తీర్పు రూ. 5,000 జరిమానా.**

**పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తును అభినందించిన ఎస్పీ**

**రాయచోటి టౌన్ జనవరి 27 ప్రభాతవార్త**



తప్పుడు పత్రాలతో పాస్‌పోర్ట్ పొందేందుకు ప్రయత్నించి పోలీసులకు చిక్కిన వ్యక్తికి రాయచోటి కోర్టు కఠిన శిక్ష విధించింది. ఫోర్జరీ పత్రాల కేసులో నిందితుడైన షేక్ వసీం అక్రమ్‌కు రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు 5,000 రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి. సుయోధన మంగళవారం తీర్పు వెలువరించారు. రాయచోటి టౌన్ అలీమాబాద్ వీధికి చెందిన షేక్ వసీం అక్రమ్ (తండ్రి: ఖాజా హుస్సేన్), 2023 నవంబర్ 5న ఈ సి ఎన్ ఆర్ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో భాగంగా అతను తన పదవ తరగతి మార్కుల మెమోను ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలను అసలైనవిగా నమ్మించి అధికారులను మోసం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ అక్రమంపై అప్పటి ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు రంగంలోకి దిగారు. నాటి సీఐ సుధాకర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడిపై క్రైమ్ నంబర్ 168/2023 కింద సెక్షన్ 420, 464, 468 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేశారు. పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ లక్ష్మి సాయి రామకృష్ణ పటిష్టమైన వాదనలు వినిపించారు. నేరం నిరూపితం కావడంతో, న్యాయమూర్తి నిందితుడికి శిక్ష ఖరారు చేశారు.

## అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా



**మైదుకూరు, జనవరి 27, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణం లో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలపై అనుమానిత ప్రాంతాలపై పోలీసులలు అత్యాధునిక డ్రోన్ కెమెరాల నిఘాతో జల్లెడ పడుతు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరించారు. జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మైదుకూరు డి.ఎస్.పి జి.రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో అర్బన్ సి.ఐ కె .రమణా రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి సేవనం, మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది దాడులు చేస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాల తో జల్లెడ పడుతూ దాడులు చేయడంతోపాటు నిందితులను గుర్తించే కార్యక్రమం చేయడం జరుగుతుంది. అనుమానిత ప్రాంతాల నుండి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి వారిని పట్టుకుని కౌన్సిలింగ్ మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రొద్దుటూరు రోడ్డు, జగనన్న కాలనీ, కొత్త బైపాస్, నంద్యాల రోడ్డు, ఇండస్ట్రియల్ ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ, వెంకట సుబ్బయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకు శిక్షణ

**పెండ్లిమర్రి, జనవరి 27, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలం స్థానిక స్త్రీ శక్తి భవన్ నందు మంగళవారం సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నడిపే వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తారన తెలిపారు. సీడ్ కాపిటల్ పొంది మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నడుపుతున్న లబ్ధిదారులు తయారు చేసే వస్తువులు ఫుడ్ ప్రాసెసింగ్‌లో ప్యాకింగ్ చేయడం, బ్రాండింగ్ అనుమతి పొందడం, వస్తువులు మార్కెటింగ్ విధానాలపైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు తప్పకుండా ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి ఉండాలన్నారు. వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ విధానంలో అమ్మకాలు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. డీఆర్పీ మహేష్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ మంజూరు చేయడానికి ఆన్‌లైన్ నమోదు చేసే విధానంపై ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసే విధానాలపైన శిక్షణ ఇచ్చారు. వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శైలజ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు తప్పకుండా యూనిట్లను ఏర్పాటు చేసి వాటిని నిర్వహంచుకోవాలన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు నాగభూషణం, గంగిరెడ్డి, గోపాల్‌రామ్, నాగయ్య, మండల సమాఖ్య అకౌంటెంట్ తులసీ, సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న సీఎం

**పెండ్లిమర్రి, జనవరి 27, ప్రభాతవార్త:**



గత నెలలో కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలంలో అన్నదాత సుఖీభవ 2వ విడత రైతుల అకౌంట్లకు నగదు జమ కార్యక్రమం జరిగింది. మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పగడాలపల్లెలోని పంట పొలాలు పరిశీలిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన పుల్లిర్పు కొండమ్మ పంట పొలంలో పనిచేసుకుంటున్న సమయంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆమెను కలిసి కూలి పని ఎలా సాగుతోంది అని అడిగిన క్రమంలో నాకు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉన్నాయని వయసు సహకరించడం లేదని బాధలు వివరించగా చలించిన సీఎం రూ.2లక్షలు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆమె రూ.2లక్షలు చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెండ్లిమర్రి డిప్యూటీ తహసీల్దారు నరసింహులు, టీడీపీ కన్వీనర్ గంగిరెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కంటి పరీక్షలు

**పీలేరు , జనవరి 27 ప్రభాతవార్త:**



విధి నిర్వహణలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎంవీఐ విజయకుమారి అన్నారు. 37వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గత వారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురిని కంటి అద్దాలకు ఎంపిక చేశారు. మంగళవారం ఎంవీఐ సొంత నిధులతో డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరమని తెలిపారు. డ్రైవర్ల మెరుగైన చూపుకోసం కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ కమిటీ మెంబరు. షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి. వి.ఎస్. లక్ష్మీ, న్యాయ సలహాదారు డాక్టర్ రాయల సుధాకర్, సిబ్బంది. రవి, పృథ్వీ, బాష తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సూచనలు ఇచ్చిన ఆర్డిఓ

**బద్వేలు అర్బన్, జనవరి 27, ప్రభాతవార్త**



బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ మంగళవారం బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని భావనారాయణ నగర్ ప్రాంతంలో మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి తో కలిసి ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటి పారుదల, మురుగు నీటి పారుదల సమస్యలను పరిశీలించి స్థానిక పరిస్థితులపై సమీక్షించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కమీషనర్‌కు ఆర్డీఓ సూచనలు చేశారు. సమస్యలకు శాశ్వత పరిష్కారాల దిశగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.ఈ ఫీల్డ్ విజిట్‌లో మునిసిపల్ కమీషనర్‌లతో పాటు రెవెన్యూ మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగాలు పోగొట్టుకున్న ఇంటి దొంగలు

**శ్రీనివాసన్, విజయభాస్కర్**

**పీలేరులో ఇంటి దొంగల పైన కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం**

**ఇద్దరు ఫారెస్ట్ అధికారులను విధుల నుంచి తొలగింపు**

**పీలేరు జనవరి 27 ప్రభాతవార్త:**

అటవీ శాఖలో ఇంటి దొంగల పని పట్టింది కూటం ప్రభుత్వం శాఖలో ఉంటూ సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపి ఎర్రచందనం అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఇద్దరు అధికారులను ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించింది ఈ సంఘటనకు వివరాలు పీలేరులో ఇంటి దొంగల పైన కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. ఇద్దరు ఫారెస్ట్ అధికారులను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఫారెస్ట్ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీలేరు అటవీ శాఖలో పని చేసే నలుగురు అటవీశాఖ అధికారులు తలుపుల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఉస్తికాయల పెంట సెక్షన్ బీట్ అధికారి టి.రెడ్డప్ప,అసిస్టెంట్ బీట్ అధికారి ఎం.విజయ భాస్కర్, నూతన కాల్వ చెక్ పోస్ట్ అధికారి సిఎం జయప్ప 2021లో ఈ ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తూ విలువైన అక్రమంగా ఎర్రచందనం సంపదను కొల్లగొడుతున్న స్మగ్లర్లకు సహకరిస్తూ వచ్చారు ఈ క్రమంలో స్మగ్లర్ల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటూ వారికి రాచబాట పరిచారు ఈ తరహాలోనే తరలిస్తున్న స్మగ్లర్లకు సహకరించిన కేసులో అరెస్టు చేసి రిమాండుకు తరలించగా వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనంతరం వీరు 2022లో తిరిగి విధుల్లోకి చేరారు. ఈ కేసు పై ప్రత్యేక అధికారి ద్వారా ఇన్వెస్టిగేషన్ చేసి రిపోర్ట్ ను అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఇదిలావుండగా ఇటీవల ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన తరువాత అటవీ శాఖలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అటవీ శాఖలో పనిచేసే ఇంటి దొంగల పైన ఉక్కుపాదం మోపారు. పీలేరు అటవీ శాఖలో అక్రమ ఎర్రచందనం రవాణాలో పట్టుబడి అరెస్ట్ అయిన ఫారెస్ట్ బీట్ అధికారులలో జయప్ప మృతి చెందగా, ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఏబిఒ ఎంవిజయ భాస్కర్ లను సర్వీసు నుంచి తొలగిస్తూ జనవరి 3వ తారీఖున జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీచేశారు.అదే విధంగా రెడ్డప్ప అనే అధికారి పై చర్యలు చేపట్టారు. అయితే దీనిని స్థానిక అధికారులు మీడియాకు తెలియజేయక పోవడం గమనార్హం. ఏది ఏమైనా ఇంటి దొంగల పైన అటవీ శాఖలో కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపడం పై పీలేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఇదే విషయాన్ని అవి శాఖ అధికారులు బయటకు రాకుండా గోప్యంగా ఉంచేందుకు విపలయత్నం చేశారు.

## ఐఈఆర్పిఎస్‌కి పూర్తిస్థాయి పే స్కేల్ అమలు పరచాలి

**రాయచోటి టౌన్ జనవరి 27 ప్రభాతవార్త**



2001 నుండి సమగ్ర శిక్షలో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి పూర్తిస్థాయి పే స్కేల్స్ అమలు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసి అన్నమయ్య జిల్లా రాయచోటి నందు ఏర్పాటుచేసిన ప్రత్యేక ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఉత్తర్వులను అనుసరించి గత 25 సంవత్సరాలుగా ప్రత్యేక ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న వీరిని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించిరి. జీవో నెంబర్ 13 ప్రకారం ఇప్పటికే మంజూరైన సెకండరీ గ్రేడ్ టీచర్ మరియు స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులలో వీరిని నియమించి పూర్తిస్థాయి వేతనాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయాలని ఆయన కోరిరి సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో మానసిక వికలాంగులకు సేవ లభిస్తున్న వీరిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వీరిని మరియు వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో జనార్ధన్ ,రామానుజన్ రెడ్డి ,జమాలులా ఖాన్ ,కళాధర్ ,త్రిలోక్ రామమోహన్ ,వెంకటేష్ ,హరి నాయక్ ,నాగేంద్ర నాయక్, ధన తదితరులు పాల్గొన్నారు.

### రాజంపేట మున్సిపాలిటీలో అభివృద్ధికి

## కేంద్రం నిధుల కోసం కృషి చేస్తా

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్**

**రాజంపేట, జనవరి 27 ప్రభాతవార్త:**



రాజంపేట పట్టణ అభివృద్ధి కి మున్సిపల్ పాలకవర్గం సహకరిస్తే కేంద్ర నిధులు సాధించేందుకు కృషి చేస్తానని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. మంగళవారం రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్స్, అధికారులతో అభివృద్ధి సమావేశమయ్యారు. పట్టణ సందరీకరణ, రోడ్ల విస్తరణ, లింకు రోడ్ల అభివృద్ధి, చక్రాల మడుగు సందరీకరణ, రైతు బజార్, పాతబస్టాండ్ నందు ఐకానిక్ బిల్డింగ్, స్మశానంలో ఎలక్ట్రీల్ పరికరం, టిటిడి సహకారంతో మినీ మహతి ఆడిటోరియం చేపడితేబాగుంటుందని తెలిపారు. పాలకమండలి చేసే అభివృద్ధి ప్రణాళికలను సంబంధిత కేంద్రమంత్రులు, రాష్ట్ర పెద్దల దృష్టికి తీసుకొనిపోయి నా వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవడానికి కలిసి పనిచేద్దామని చైర్మన్ శ్రీనివాసులు రెడ్డిని కోరారు. అవసరం అయితే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కావలసిన తీర్మానాలు చెయ్యాలని కమిషనర్ కి చైర్మన్, సభ్యులు కోరారు.

## ఎర్రముక్కపల్లె సమీపంలో స్థల వివాదం

**- లబోదిబోమంటూ బాధితులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు**

**కడప క్రైం, జనవరి 27, ప్రభాతవార్త:**



నగరంలోని ఎర్రముక్కపల్లె పీఎఫ్ ఆఫీస్ సమీపంలో ఓ ఇంటిపై కొందరు అర్ధరాత్రి దాడి చేసి అక్కడ ఉన్న ఇళ్లను పొక్లైన్‌తో కూల్చిన ఘటన చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొందరు 2 పొక్లైన్లతో ఇళ్లను కూల్చివేయడంతో పాటు ఇంట్లో నివసించే వారిపై అమానుషంగా దాడి చేసి ఇంట్లోని సామాన్లు, వస్తువులను చెల్లాచెదురు చేసిన ఘటన సినీ ఫక్కీలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితుడు సట్టి భాస్కర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీఎఫ్ కార్యాలయం సమీపంలో భాస్కర్ కుటుంబీకులు సుమారు 9 సెంట్ల స్థలంలో గత కొంత కాలంగా వారి పూర్వీకుల కాలం నుంచి నివాసం ఉంటున్నారు. అయితే భాస్కర్ కుటుంబీలు గత 13 సంవత్సరాల క్రితం 2013లో తిరుపతికి చెందిన ఓ వ్యక్తి వద్ద సుమారు రూ.20లక్షలు అప్పుగా తీసుకొని భాస్కర్ తన అన్నదమ్ములు తనఖ పెట్టారు. అయితే సంవత్సరం లోపు డబ్బు చెల్లించేలా వ్యక్తి రిజిస్టర్ చేయించారు. రూ.20లక్షలకు గాను రూ.90లక్షలు అసలు, వడ్డీ చెల్లించామని అయితే ఆ సమయంలో డబ్బు చెల్లించిన సమయంలో ఎలాంటి రసీదు ఇవ్వలేదన్నారు. డబ్బు ఇచ్చినట్లు రాయించాలని అడిగితే తమపై నమ్మకం లేదా అని నమ్మబలికారు. గత ఏడాది రూ.2కోట్లు చెల్లిస్తే మీ ఇంటిని మీ పేర రిజిస్టర్ చేయిస్తానని భాస్కర్ తెలిపారు. అయితే భాస్కర్ మేము బాకీ చెల్లించామని మీకు ఎలాంటి అప్పు లేమని తెలిపామని అయినా అప్పుడప్పుడు తమను బెదిరిస్తూ ఉన్నారన్నారు. ఇది ఇలా ఉండగా 26వ తేదీ సోమవారం అర్ధరాత్రి సుమారు వంద మంది యువకులు మద్యం సేవించి వచ్చి ఇంట్లోని మహిళలను, వృద్దులను బయటకు తోసి కులం పేరుతో దూషిస్తూ తమ ఇళ్లను పడగొట్టారని అలాగే బీరువాలోని డబ్బు, నగలు లాక్కెల్లారన్నారు. ఈ విషయమై స్థానిక వన్‌టౌన్‌లో పిర్యాదు చేశామన్నారు.

## సమస్యల పరిష్కారానికి సబ్ కలెక్టర్కు వినతి

**రాజంపేట, జనవరి 27 ప్రభాతవార్త:**

పట్టణంలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి. లక్షి ్మ నారాయణ మంగళవారం సబ్ కలెక్టర్, రాజంపేట నియోజకవర్గ ప్రత్యేక అధి కారి హెచ్ఎస్ భావనను కలసి వినతి పత్రం అందజేశారు.దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. రోడ్ల విస్తరణ లేకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత ఐదేళ్ల క్రితం నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేసేల చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న స్థలంలోనే రాజంపేట కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దూరంగా తరలిస్తే ప్రజలు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు.22ఎ చుక్కల భూముల సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ఎస్ షామీర్ భాషా పాల్గొన్నారు.



## మున్సిపల్ బడ్జెట్ రూ.20.04 కోట్లు ఆమోదం

రాజంపేట, జనవరి 27 ప్రభాతవార్త



2026, 27 ఆర్థిక సంవత్సరానికి రాజంపేట మున్సిపల్ బడ్జెట్ 20.04కోట్లకు పాలకమండలి ఆమోదించింది. మంగళవారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డినాగిరెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ లో ఆరో వార్డు కౌన్సిలర్ తంబా సుబ్రహ్మణ్యం మృతికి కౌన్సిల్ సంతాపం వ్యక్తం చేసింది .ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. గత ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనా 16.71 కోట్ల రూపాయలు కాగా తాజా బడ్జెట్ 20.04 కోట్ల అంచనాలను సిద్ధం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను 3.84 కోట్లు , నీటి పన్ను 76.97 లక్షలతో పాటు ఇతర ఆదాయంతో కలిపి 8.02 కోట్లుగా పేర్కొన్నారు. అలాగే స్టాంప్ డ్యూటీ రెండు కోట్లు ,మార్కెట్ కిస్తీ 86.74 లక్షలు, షాపుల అద్దెద్వారా 1.43 కోట్లు వస్తుందని అంచనా వేశారు. డెవలప్మెంట్ చార్జెస్ ద్వారా 36.30 లక్షలు ,బెటర్మెంట్ చార్జెస్ 60.50 లక్షలు, మ్యుటేషన్ ద్వారా 30.20 లక్షలు వస్తుందని అంచనా వేశారు. రెవెన్యూ గ్రాంట్లు 70 లక్షలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.సిబ్బంది జీతభత్యాలకు 4.32 కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇతర ఖర్చులు 6.36 కోట్లుగా పేర్కొన్నారు.

## తెదేపా వర్క్ షాప్‌కి హాజరయిన పల్లె గంగాధర్

ఖాజీపేట, జనవరి 27, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మంగళగిరి టిడిపి పార్టీ ఆఫీస్ నందు మంగళవారం నాడు ఏర్పాటు చేసిన పార్లమెంటు కమిటి వర్క్ షాప్ నందు ఖాజీపేట కి చెందిన టిడిపి కడప జిల్లా కార్యదర్శి పల్లె గంగాధర్ పాల్గొన్నారు. వీరితో పాటు కడప జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె గంగాధర్ మాట్లాడుతూ మండలం లో పార్టీ పటిష్టం కోసం మరింత కష్టపడుతూ ముందు కెళతామనీ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సవివరంగా వివరిస్తూ ప్రజా సంక్షేమం పట్ల తెదేపా కున్న చిత్తశుద్ధి ప్రజలకు వివరిస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం ప్రజల సంక్షేమం కోసం పరితపించే ప్రజానాయకుడనీ, శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ముందుచూపుతో మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధి బాట లో పయనిస్తోందనీ తెలిపారు.

## టీడీపీ కన్వీనర్ గా రమణారెడ్డి

దువ్వూరు, జనవరి 27, ప్రభాతవార్త:

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా తిరిగి బోరెడ్డి వెంకట రమణారెడ్డిని 2వ సారి నియమించారు. ఈ మేరకు సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ 2వ సారి బోరెడ్డి వెంకట రమణారెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి తిరిగి రెండవసారి తనను నియమించారని, పార్టీని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీరామా అవతారంలో భక్తులకు దర్శనం

రామసముద్రం జనవరి 27 ప్రభాతవార్త



మండల కేంద్రంలో కొలువైన శ్రీలక్ష్మి జనార్ధన స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వేడుకలు భాగంగా మంగళవారం 4 వ రోజు ఆలయ ప్రధాన అర్చకులు పార్ధసారథి బటర్, కులశేఖర్ బటర్ ఉదయం శ్రీలక్ష్మి జనార్ధన స్వామి వారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి వేదమంత్రాలతో అభిషేకాలు, అర్చనలు, ఉంజల్ సేవ నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. అనంతరం స్వామి వారు పలు రకాలపుష్పాలు,ఆభరణా లతో శ్రీ రామా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు, స్వామి వారిని చూసేందుకు భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారిని భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారికి అభిషేకం సేవ కర్తలు ఆర్. బాబారెడ్డి జ్ఞాపకార్థం వీరి కుమారులు ఆర్. భరత్ రెడ్డి, ఆర్. ప్రదీప్ రెడ్డి, అరవింద్ రెడ్డి నిర్వహించారు,రాత్రి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీవీరాంజనేయ స్వామి భజన మండలి గుట్టపాల్యం వారిచే భజన గోవిందం కార్యక్రమాలు నిర్వహించారు.

## పంటలో వచ్చే సమస్యలపై రైతులతో ఎ.ఒ

మైదుకూరు, జనవరి 27, ప్రభాతవార్త:



మైదుకూరు మండలంలోని ఉప్పుగుంటపల్లె, గంగాయపల్లె గ్రామాలలో రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎ.ఒ.బాల గంగాధర్ రెడ్డి పంటలో వచ్చే సమస్యలపై గురించి రైతులతో చర్చించడం జరిగింది. గ్రామాల్లో సాగు చేసిన మినుము, మొక్కజొన్న, నూగు పంటల స్థితిగతులు, సమస్యలపై అలాగే ప్రభుత్వం ద్వారా వచ్చే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల పై రైతులకు వివరించడం. ప్రభుత్వం అందిస్తున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య చేయించుకోవడం. రైతు సేవ కేంద్రం నందు పాస్ బుక్, ఆధార్, తీసుకొని వెళ్లి తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేసుకోవాలి అన్నారు. ప్రస్తుతం రబీ పంట నమోదు, రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరూ తమ పరిధి లో ఉన్న గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేస్తారని రైతులు చేయించుకోవాలని తెలియజేశారు.మినుము, మొక్కజొన్న , సజ్జలు, మిరప, టమోటా, ఆకు కూరలు, రైతులు సాగుచేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంటను ముందు చేసుకోవాలని తెలియజేశారు. పంట చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, కనీసం మద్దతు ధర, ప్రభుత్వం ద్వారా పంట కొనుగోలుకు మొదలగు వాటికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమం లో సెరికల్చర్ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు గురించి పట్టుపురుగుల పెంపకం ద్వారా కలిగే ఉపయోగాలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. మైదుకూరు మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో పంట పొలాలను సందర్శించి వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమములో మైదుకూరు మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్‌రెడ్డి,సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బిఎంఎస్ యూనియన్ బలోపేతం

కడప క్రైం, జనవరి 27, ప్రభాతవార్త:



రాష్ట్ర అధ్యక్షులు జయన్నేడు కడుపునగరంలో బహుజన ఎంప్లాయిస్ యూనియన్ కొంత మంది ఉద్యోగస్తులు బిఎంఎస్ యూనియన్ లోకి రాష్ట్ర అధ్యక్షులు జయప్ప ఆధ్వర్యంలో కడప జిల్లా అధ్యక్షులు దేవేందర్ రావు గారి సమక్షంలో వారి యూనియన్ లో కి స్వాగతించారు యూనియన్ లో చేరిన వారు రవి సుధాకర్ రాజా ప్రసాద్ రమేష్ నాగరాజు వెంకటేష్ గౌస్ బాషా అఖిల్ ఆంధ్ర రాష్ట్ర పౌర ఎంప్లాయిస్ యూనియన్ అభివృద్ధికి మా సహాయ సహకారాలు అందిస్తామని అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏదైనా సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తామని అందరితో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మన యూనియన్ తో కలిసి బలోపేతం చేయాలని తెలిపారు.

## ప్రొద్దుటూరు అటవీ డివిజన్ స్వతంత్ర డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 27, ప్రభాత వార్త



ప్రొద్దుటూరు అటవీ డివిజన్‌ను మళ్లీ స్వతంత్ర డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఈ విషయమై ఆయన అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రొద్దుటూరు అటవీ డివిజన్ 1965కి ముందే ఏర్పడిన పురాతన విభాగమని, ప్రస్తుతం కడప డివిజన్‌లో విలీనం కావడంతో పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో అటవీ భూముల ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని, విలువైన ఎర్రచందనం అడవులు, పులుల నివాస ప్రాంతాలు, జీవ వైవిధ్యం సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. అలాగే మూడు వన్యప్రాణి అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు కూడా ఈ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు అటవీ డివిజన్‌ను స్వతంత్రంగా ఏర్పాటు చేస్తే అటవీ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అక్రమ కార్యకలాపాల నియంత్రణ మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఈ విజ్ఞప్తికి ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే సానుకూలంగా స్పందించి, అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారన్నారు.

## కల్తీ చికెన్ విక్రయం తో ఆందోళన

పుంగనూరు జనవరి 27 ప్రభాతవార్త

పట్టణంలోని రాతి మసీదు వీధిలోని ఒక చికెన్ సెంటర్లో కల్తీ చేసిన చికెన్ విక్రయించడంతో బాధితులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి రాతి మసీదు వీధిలోని జఫ్రూల్లా చికెన్ సెంటర్ నందు ఒక కుటుంబం తమ ఇంట్లో జరిగే కార్యక్రమం కోసం 40 కిలోల చికెన్ కొన్నారు. అయితే చికెన్ వండిన తర్వాత ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా రుచులు రావడంతో ఈ విషయమై జఫ్రూలా చికెన్ సెంటర్ యాజమాన్యాన్ని వాళ్ళు ప్రశ్నించారు. చికెన్ సెంటర్ యాజమాన్యం సరే సమాధానం ఇవ్వకపోగా అక్కడ పనిచేసే వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. ప్రశ్నించిన చికెన్ కొనుగోలుదారులను పోలీసులు తమ వెంట తీసుకువెళ్లారు. అయితే ఈ విషయమై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## 39 కోట్ల డ్రైనేజీ డీపీఆర్‌లో పేదల కాలనీలను చేర్చాలి

బద్వేలు, జనవరి 27, ప్రభాతవార్త



పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి మంజూరైన 39 కోట్ల రూపాయల నిధుల డీపీఆర్‌లో పేదల కాలనీలను చేర్చకపోవడం అన్యాయమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్. చంద్రశేఖర్ విమర్శించారు. పేదల కాలనీలను తక్షణమే డీపీఆర్‌లో చేర్చకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఉదయం బద్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య అధ్యక్షతన జరిగిన శాఖ కార్యదర్శుల సమావేశంలో చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణానికి డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వం 39 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవంగా పేదలు నివసించే కాలనీలను పక్కనపెట్టి ధనికులు నివసించే ప్రాంతాల్లో మాత్రమే డ్రైనేజీ నిర్మాణానికి దొడ్డిదారిన డీపీఆర్ రూపొందించి కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపించడం దుర్మార్గమని ఆరోపించారు. కావున మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేదల కాలనీల సమస్యలను గుర్తించి మార్తం నగర్ నుంచి ఐలమ్మ కాలనీ వరకు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి డీపీఆర్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బండి అనిల్తో పాటు శాఖ కార్యదర్శులు క్రరేటి బాబు, గలిజేర్ల రామరాజు, జయరామరాజు, గంటా మహబూబ్ బాషా, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

బద్వేల్ అర్బన్ జనవరి 27 ప్రభాత వార్త :



మున్సిపాలిటీ పరిధి లోని చిన్నకేశంపల్లె పాఠశాల పూర్వ తెలుగు ఉపాధ్యాయుడు మాదన విజయకుమార్ ఆ పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సభలో 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. మాదన విజయకుమార్ చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ గత జూన్ మాసంలో జరిగిన బదిలీలలో మండల పరిధిలోని రాజుపాలెం ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన కోసం విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రణాళి కబద్ధంగా చదవాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకునే విధంగా వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని, అప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకుంటూ పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువచ్చిన వారవుతారన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయ కుమార్ విద్యా సామాగ్రిని అందజేస్తూ విద్యార్థులకు స్ఫూర్తి నింపుతుండడం పట్ల వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజి పెంచలయ్య అభినందించారు.

## పాడి పశువుల ద్వారా అధిక లాభాలు

దువ్వూరు, జనవరి 27, ప్రభాతవార్త:



గ్రామాల్లోని రైతులు పాడి పశువులను సరైన పోషణలో పెంచుకుంటే అధిక లాభాలు సాధించవచ్చునని పశు వైద్య శిబిరాల పర్యవేక్షణ అధికారి ఏడిఏ డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో పశుసంవర్ధక శాఖ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1600 పశువులకు వివిధ రకాల చికిత్సలు, నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. అలాగే 75 గొర్రెలకు పశు సంవర్ధక శాఖ ద్వారా భీమ సౌకర్యం కల్పించారు. పాడి పశువులను సరైన పోషణ ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని, అలాగే వాటికి సరైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజా, తిమ్మారెడ్డి, ధనుంజయ రెడ్డి రవీంద్రా రెడ్డి అలాగే సహాయక వైద్య సిబ్బంది లక్ష్మీకాంత్, అమీర్, సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు జనవరి 27 ప్రభాతవార్త:



ప్రజల నుంచి వచ్చే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహాశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్. రైతుల నుంచి వచ్చిన అర్జీలు, భూముల రీ సర్వేలో వచ్చే సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రసాద్, ఆర్వ మురగయ్య, సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వోలు హేమంత్నాయక్, కల్యాణి, సిద్ధయ్య, సుధాకర్, ఇమ్రాన్, ర మణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పులివెందుల, జనవరి 27 , ప్రభాత వార్త :



పులివెందుల పట్టణంలోని సిఎస్ఐ చర్చి గౌడ్‌లో దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి, గుండె, దంత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సిఎస్ఐ చర్చి ట్రెజరర్ వైయస్ మదన్‌మోహన్ రెడ్డి, చర్చి ఫాదర్ థామస్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైయస్ మధు మాట్లాడుతూ డాక్టర్ కోలాప్రసాద్ సేవా తత్పరుడని, ఆయన ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయన్నారు. కుల, మతాలకు అతీతంగా 550 మందికి పైగా ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని కంటి, గుండె, దంత సంబంధిత పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.వ్యాధి తీవ్రతను బట్టి డాక్టర్లు ఉచితంగా మందులు అందించారన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా మరిన్ని నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మదర్ తెరిసా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చి ట్రెజరర్ వైయస్ మదన్‌మోహన్ రెడ్డి, ఫాదర్ థామస్ బాబు, అలాగే శిబిరానికి వచ్చిన వైద్యులను డాక్టర్ కోలాప్రసాద్ దుశ్శాలువాలు, పూలహారాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రశాంత్, దేవరాజు కృప రాజు, డేవిడ్ రాజు, క్రాంతి రాజు, ఆనంద్ పాల్, రెడ్డి ప్రకాష్ రాజు, శీనన్న, ప్రభాకర్, చిన్నప్ప, కోలా యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వారానికి ఐదు రోజులు పని దినాలు కల్పించాలి



బద్వేలు అర్బన్, జనవరి 27, ప్రభాతవార్త

బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులు పని కల్పించాలనీ కోరుతూ మంగళవారం. పట్టణంలోని మైదుకూరు రోడ్డు వద్ద ఉన్నటువంటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఆధ్వర్యంలో ఇతర బ్యాంకుల సిబ్బంది ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ లోకల్ సెక్రటరీ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకుల్లో ఆరు రోజులు పనిచేయాల్సి వస్తుండటంతో ఉద్యోగులపై పని భారం పెరుగు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారానికి ఐదు రోజుల పని విధానం అమ లు చేస్తే ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడుతుందని, వినియోగదారు లకు కూడా మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. సంబంధిత బ్యాంకు యాజమాన్యం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉచిత పశువుల ఆరోగ్య శిబిరం..

సుండుపల్లె, జనవరి 27,ప్రభాతవార్త:



మండల పరిధిలోని సుండుపల్లి గ్రామ పంచాయితీ చెన్నంశెట్టిపల్లి లో మరియు పొలిమేరపల్లి గ్రామ పంచాయతీ నందు గల మడితాటి వాండ్లవల్లి లో మంగళవారము ఖి పాడి ఆరోగ్య శిబిరంఖి (పశు ఆరోగ్య శిబిరం) ఘనంగా నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 71 పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ శిబిరం వివరాలను అధికారులు వెల్లడిస్తూ.. మొత్తం 64మంది రైతులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని తెలిపారు. చికిత్స పొందిన పశువులలో 22వంధ్యత్వ సమస్య ఉన్న పశువులకు ప్రత్యేక చికిత్స అందించగా, 18పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. మరో 32పశువులకు గర్భ నిర్ధారణపరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా 72పెద్ద పశువులకు, 32 దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. అలాగే గ్రామంలోని 253గొర్రెలు మరియు మేకలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ప్రభుత్వ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పశువైద్యాధికారులు కోరారు. ఈ కార్యక్రమం లో పశు సంవర్ధక సహాయ సంచాలకులు డా.విజయ్ కుమార్ కొమ్మినేని టి.సుండుపల్లి మండల పశు వైద్యులు డా. రవి కుమార్ నారే,ఎస్.మాలతి సాయి లక్ష్మి, మండల పశువైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలపై చర్చించిన చైతన్య ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్

బద్వేలు అర్బన్, జనవరి 27 (ప్రభాత వార్త):



ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శ్రీ చైతన్య ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు చర్చించడం జరిగింది. ఈ మేరకు మంగళవారం పట్టణలోని వారి కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎలక్ట్రీషియన్ రేట్లు, లేబర్ కార్డులు, బీఓసీ కార్డు గురించి చర్చించారు. అలాగే జనవరి 27ను ఎలక్ట్రీషియన్ డే గా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఎలక్ట్రీషియన్లకు సపరేటుగా కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, కార్మికుల సంక్షేమ బోర్డు ప్రతి సంవత్సరం పనిముట్లు అందజేయాలని, చాలా సంవత్సరాల నుంచి పనిముట్లు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బోర్డు నుంచి వారికి రావలసిన బెనిఫిట్ల గురించి తెలియజేశారు. ఇంకా పలు డిమాండ్లు చేశారు. ఈ కార్యకమ్రంలో పలువురు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటోలో పోగొట్టుకున్న బ్యాగు, నగదును రికవరీ చేసిన పోలీసులు

బద్వేల్ అర్బన్, జనవరి 27, ప్రభాతవార్త

బద్వేల్ పట్టణంలోని దిగువ బ్రాహ్మణ వీధికి చెందిన..సత్యనారాయణ శర్మ అను రిటైర్డ్ టీచర్ బద్వేల్లోని సెంటర్ నుండి దిగువ బ్రాహ్మణ వీధికి ఆటోలో వెళ్లి ఆటోలో తన బ్యాగ్ మరచిపోయి ఇంటికి వెళ్లిపోయినాడు. బ్యాగులో 40 వేల రూపాయలు నగదు డబ్బు ఉందని న్యాయం చేయమని బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ లో తెలిపారు. బద్వేల్ అర్బన్ ఇన్స్పెక్టర్ లింగప్ప, ఎస్సై చిరంజీవి, కానిస్టేబుల్ ఓబులేసులను టీంగా నియమించి విచారించమని తెలిపినారు. ఎస్సై చిరంజీవి విచారించి సదరు ఆటో డ్రైవర్ అట్లూరు మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాడపూర్ వెంకటరమణ గా గుర్తించి అతని వద్దనుండి 40 వేలరూపాయలు డబ్బును మంగళవారం సత్యనారాయణ శర్మ కి ఇన్స్పెక్టర్ లింగప్ప అందించడమైనది. నీజాయితిగా డబ్బును తిరిగి ఇచ్చిన డ్రైవర్ ను అభినందించారూ.



## ఏఐటీయూసీ పులివెందుల ఏరియా నూతన కమిటీ ఎన్నిక..

వేంపల్లి: జనవరి 27 (ప్రభాత వార్త)



స్థానిక వేంపల్లి ఎస్టియు ఆఫీసులో ఏఐటియుసి సమావేశంలో ఏఐటీయూసీ పులివెందుల నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటియుసి నూతనంగా ఏరియా కమిటీ ఎన్నుకున్నట్లు విలేకరులతో అన్నారు. ఈ నూతన కమిటీలో 41 మంది ఏరియా సమితి సభ్యులు, 14 మంది ఏరియా కార్యవర్గ సభ్యులు వీరితో పాటు ఏఐటీయూసీ నూతన ఏరియా కార్యదర్శిగా బ్రహ్మం కొత్తకాల్వ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులుగా బల్లారపు రామాంజనేయులు, ఏఐటియుసి ఏరియా కోశాధికారిగా మల్లేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని అన్నారు.

## కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత ఇచ్చింది గోరంత

వేంపల్లి: జనవరి 27 (ప్రభాత వార్త)



ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారము కేంద్ర ప్రభుత్వము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత కాగా ఈ 11 సంవత్సరాలలో ఇచ్చింది గోరంత మాత్రమే అని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూఈ పార్లమెంటు సమావేశాలలో నైనా రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఈ సమస్యలపై పార్లమెంటులో గళమెత్తి పోరాడి వాటిని సాధించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాను అమలు చేస్తామని పార్లమెంటు సాక్షిగా ప్రకటన చేసింది. మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం తీర్మానం కూడా చేసింది. దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు దాటిన ఇంత వరకు అమలు చేయలేదు. విభజన చట్టం సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ గానీ, ఒరిస్సా లోని కె బి కె తరహా ప్యాకేజీ గానీ అమలు చేయాలి.11 ఏళ్లు పూర్తయినా మోడీ ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయం. ఈ పార్లమెంటు సమావేశాలలో పార్లమెంటు సభ్యులు ఈ ప్యాకేజీ కోసం పోరాడి సాధించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఐఐటి,ఎన్ఐటి లాంటి 13 కేంద్రీయ సంస్థలను నవ్యాంధ్రలో ఏర్పాటు చేయాల్సి ఉండగా అవన్నీ నత్త నడకన సాగుతున్నాయి.విభజన చట్టంలో 9,10 షెడ్యూల్ల కింద ఉన్న సంస్థలు రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ రాలేదు. ఈ సమస్యలన్నిటిమీద రాష్ట్రానికి చెందిన లోక్ సభ, రాజ్యసభ సభ్యులు నిర్మాణాత్మక వైఖరితో పటిష్టమైన వాదనలు వినిపించి సాధించాలని తులసి రెడ్డి కోరారు. ఇప్పటికైనా ఊకదంపుడు ఉపన్యాసాలు మానుకొని నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. సూపర్ సిక్స్ హామీలలో ఇంకా అమలుకు నోచుకోని నిరుద్యోగ భృతి,ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం ఈ హామీలను వెంటనే అమలు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తర్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, నా మా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేతి వృత్తి కార్మికులు అందరూ ఐక్యంగా ఉండాలి

వేంపల్లె: జనవరి 27 (ప్రభాత వార్త)



చేతి వృత్తి పని చేసే కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకొనేందుకు పోరాటం చేయాలని వేంపల్లె ఎలక్ట్రికల్ ప్రయివేటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముని కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రయివేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అలాగే చేతి వృత్తి కార్మికులకు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తి పనులు చేసే ఎలక్ట్రికల్ కార్మికులకు లేబర్ అధికారులు కార్డులను పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఎలక్ట్రికల్ పని చేసే సమయంలో గాయపడిన కార్మికులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. పనిముట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ పని చేస్తు ప్రమాదవశాత్తు గాయపడిన ఇద్దరు కార్మికులకు అసోసియేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ 3 వేలు చొప్పున రూ 6 వేలు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ తరుపున ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆదుకొంటున్నట్లు చెప్పారు. చేతి వృత్తి పనులు చేసుకొనే కార్మికులు అందరూ సమస్యలు తీరాలంటే ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ ఎలక్ట్రికల్ నాయకులైన జిలాన్, అబ్దుల్ హకీంలను అసోసియేషన్ తరుపున శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె ప్రయివేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకులు, ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు విజయవంతం

కలికిరి, జనవరి 27, ప్రభాతవార్త:



మండలంలోని చీకటిపల్లి మరియు పారపట్ల పంచాయతీకి చెందిన పారపట్ల, కురప్పల్లి, రంగనాథపురం గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 పశువులకు వెయ్యి గొర్రెలకు, 50 దూడలకు నట్టల నివారణ సుమారు 30 పశువులకు గర్భకోస వ్యాధుల చికిత్సలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ఏడాదికి ఒక దూడ మరియు పశు పోషణపైన పునరుత్పత్తిపై మరియు గొర్రెల కాపరులకు అధిక ఉత్పత్తిపైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డా.కె.వెంకట మునినాయుడు, సహాయ సంచాలకులు కలికిరి, డా.కీర్తి పశఉవైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, మేడికుర్తి డా.గిరినాథ్‌రెడ్డి, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, మహల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరుగులుపెట్టిస్తున్న అధికారులు

కలికిరి, జనవరి 27, ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో కలికిరి మండలంలో అభివృద్ధి పనులు మండల స్థాయి అధికారులు పరుగులు పెట్టిస్తున్నారు. కలికిరి మేజర్ పంచాయతీ తుమ్మలపేట వడ్డేపల్లిలో పల్లెపండగ 2.0 లో భాగంగా రూ.15.80లక్షలు ఉపాధి హామీ పథకం నిధులతో 390 మీటర్లు సిమెంటు రోడ్లకు నిధులు మంజూరు కావడం జరిగింది. దీంతో తుమ్మలపెంట వడ్డేపల్లిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగి పూర్తయ్యాయి. ఈ పనులను సోమవారం ఎంపీడీవో భానుమూర్తిరావు, ఏపీఓ మంజుల, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ సురేంద్ర, కలికిరి మార్కెట్‌యార్డు డైరెక్టర్ తేజ, అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష

దువ్వూరు, జనవరి 27, ప్రభాతవార్త:

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వివిధ రకాల అభివృద్ధి పనులపై ఎంపిడిఓ సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ యాదవ్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం మార్చితో ముగుస్తుందని గ్రామపంచాయతీలో ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్లను పూర్తిచేయా లన్నారు. స్వచ్ఛ రథం కేటా యించారని గ్రామాల వారిగా ఆ రథం వస్తుందని అక్కడ వీధుల్లో చెత్తాచెదారాన్ని సేకరించే విధంగా చూడా లన్నారు.

**CHANGE OF NAME**

I, BHUMI SUNIL, father of Bhumi Dhruva (Old Name), minor, residing at 57/342-B-1, R. V. Nagar Post, Akkayapalli, Kadapa, YSR District, hereby declare that my son's name has been changed to BHUMI DHRUVA DEVA (New Name). Henceforth, he shall be known as BHUMI DHRUVA DEVA for all purposes.

# ఐదు రోజుల పని విధానం అమలు చేయాలి

**పులివెందుల , జనవరి 27 ,ప్రభాతవార్త :**

బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం ఐదు రోజుల పని విధానం ఎంతో అవసరం అని సర్వ బ్యాంకుల లోకల్ సెక్రటరీ అధికారులు అన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట బ్యాంకు ఉద్యోగులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్, ఆంధ్రప్రగతి బ్యాంకు, హెచ్డి ఎఫ్సి, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆక్సిస్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి పౌరుడికి విశిష్టమైన సేవలు అందించడంలో బ్యాంకులు ముందువరుసలో ఉంటాయని పేర్కొన్నారు. నిపుణుల అభిప్రాయం మేరకు బ్యాంకింగ్ వ్యవస్థలో ఐదు రోజుల పని విధానం అమలు చేయడం అత్యంత కీలకమని అన్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా యని విమర్శించారు. ప్రస్తుతం జీవిత బీమా సంస్థల తరహాలో బ్యాంకులకు కూడా ఐదు రోజుల పని విధానం కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారా మన్ స్పందించి తమ న్యాయ మైన డిమాండ్‌కు సానుకూ లంగా స్పందించాలని కోరారు. లేనిపక్షంలో తమ డిమాండ్ సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు తమ న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి సాను కూల నిర్ణయం తీసుకుం టాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ పరిధిలోని వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ లోకల్ సెక్రటరీ రఫీ, స్టేట్ బ్యాంక్ టౌన్ బ్రాంచ్ లోకల్ సెక్రటరీ అన్వేష్, జేఎన్టీయూ బ్రాంచ్ లోకల్ సెక్రటరీ జిలాన్,కోమన్నూతల బ్రాంచ్ లోకల్ సెక్రటరీ ఓబులేసు, యూనియన్ బ్యాంక్ లోకల్ సెక్రటరీ ఓబులేసు, ఆంధ్రాప్రగతి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కిషోర్ కుమార్, అన్ని బ్యాంకుల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



స్టేట్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

## యువత ఆరోగ్యకర జీవనశైలితో సమాజ అభివృద్ధి

**వైవీయూ, జనవరి 27, ప్రభాతవార్త:**



యువత ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని వై.వి.యు వి. సి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో యువతలో ఆరోగ్యకర జీవనశైలి ప్రోత్సాహం" అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించే ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టిఓటి) కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ శారీరక వ్యాయామం లేకపోవడం, అనారోగ్యకర ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తదుపరి సెషన్లలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య నిపుణులు ఎండీ డా. బొలిశెట్టి రాకేష్ ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పిస్తూ సమతుల ఆహారం, నిత్య వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, నివారణాత్మక వైద్యం ప్రాధాన్యతను వివరించారు. మరొక సెషన్‌లో కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు అఖిల్ చక్రవర్తి యువతలో అనారోగ్యకర జీవనశైలి వల్ల కలిగే ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, మానసిక ఆరోగ్య సమస్యలపై ఆయన వివరించారు. మధ్యాహ్నం సెషన్లలో విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య సంచాలకులు డా. కె. రామసుబ్బ రెడ్డి మాట్లాడుతూ శారీరక దృఢత్వం, చురుకైన జీవనం పై అవగాహన కల్పించారు. చివరి సెషన్‌లో సరైన నిద్ర, విశ్రాంతి ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్కు అంతరాయం

**తొండూరు జనవరి 27 ప్రభాతవార్త :**

గ్రామంలో 28వ తేదీ, బుధవారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 12:00గంటల వరకు 11కెవి తొండూరు టౌన్ మరియు ఇనగలూరు సంప్ ఫీడర్స్ లైన్ షిఫ్టింగ్ కారణంగా 33/11 కె.వి తొండూరు సబ్ స్టేషన్ప పరిధిలోని తొండూరు గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ప్రజలు, రైతులందరూ సహకరించవలసినదిగా విద్యుత్ ఏఈ వి.బాలసంజీవులు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## వైఎస్ఆర్సిపి పార్టీ గ్రామ అధ్యక్షుల నియామకం

**రామసముద్రం, జనవరి 27ప్రభాతవార్త**



మండలంలో మంగళవారం వైఎస్ఆర్సిపి మండల పరిశీలకులు తట్టి శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు కేశవరెడ్డి, జడ్పిటీ సి రామచంద్రారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి,గెవన్న దొడ్డిపల్లె ఆనంద ఆధ్వర్యంలో ఆర్. నడింపల్లె పెద్దకురప్పల్లె,కురిజల గ్రామ పంచాయతీలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో గ్రామ పంచాయతీలలో సంస్థాగతంగా బలోపేతం కొరకు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి అధ్యక్షులును ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్. నడింపల్లె గ్రామపంచాయతీ అధ్యక్షులుగాఎగువ బొంపల్లి కన్నె మడుగు రెడ్డి శేఖర్ నాయుడు, పెద్దకురప్పల్లె గ్రామపంచాయతీ గ్రామ అధ్యక్షులుగా తప్పసానిపల్లి యల్లంకల శ్రీనివాసులు నాయుడు, కురిజల గ్రామ పంచాయతీ అధ్యక్షులుగా కురిజల గ్రామ నూతనపాటి వెంకటరమణ నాయుడులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మండల బిసి నాయకులు రెడ్డి వీరే గౌడ్, మండలవైసీపీ మైనారిటీ అధ్యక్షులు సందూరి సర్దార్ బాషా సిహెచ్ ప్రకాష్,ఎస్సీ నాయకులు క్రిష్ణప్ప,సర్పంచ్ రెడ్డెప్ప నాయుడు, ఎంపిటీసీ రెడ్డెప్ప,ఉపసర్పంచ్ దొరబాబు నాగప్ప, కొమ్మునారాయణస్వామి, మంజునాథ్ రెడ్డి,మండల యూత్ కన్వీనర్ బాలాజీ,హరి నాయుడు, వైసీపీ మెంబెర్ కేశవ,విజయ్,సుబ్రహ్మణ్యం,కదిరిప్ప, విజయారెడ్డి, గుణశేఖర్ సోమశేఖర్, రాజేష్, విశ్వనాథ్ రెడ్డి రామకృష్ణ అమరప్ప మల్లప్ప వాలేప్ప, చెంగల్ రాయుడు, భరత్, శంకర నాయుడు రెడ్డిశేఖర్ నరసింహులు, ఈశ్వరప్ప మస్తాన్ వల్లి,భాస్కర్, గోపాల్, శ్రీనివాసులు మదనపల్లి నాయకులు ప్రకాష్ రెడ్డి, మాధవరెడ్డి ఇర్ఫాన్ ఖాన్, సాంబశివారెడ్డి, మల్లెల సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశుసంపదను పరిరక్షించుకోవాలి : పవన్‌కుమార్

**చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త**



పాడిరైతులు పశుసంపదను పరిరక్షించుకోవాలని పశువైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంటలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వ్యవసాయం జూదంలా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పాడి పరిశ్రమపై ఆధార పడుతున్నారన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆర్థికంగా ఎదగవచ్చునన్నారు. అనంతరం చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన 130పశువులకు ఛూటాక్స్ స్ప్రే చేసారు. అదే విధంగా 70దూడలకు నట్టల నిర్మూలనా మందును తాపించారు. గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. పశువైద్య సిబ్బంది గోవర్ధన్, మహమ్మద్‌ఆలీ, రెడ్డిప్రసాద్, హరీష్, పాడి రైతులు పాల్గొన్నారు.

## వైష్ణవీమాతా ఆలయంలో మాఘమాస శోభ

**చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త**



పుదిపట్ల స్వయంభు వైష్ణవీమాతా ఆలయంలో మాఘమాసం నవరాత్రి ఉత్సవాల శోభ నెలకొనింది. ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణీ ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి, నాగభైరవులకు విశేషాభిషేకాలు అలంకరణలు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించారు. తెల్లనీళ్ళపల్లి ఓబుల్‌రెడ్డి, మాలతి, అమరకృష్ణాపురం నారాయణలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.

## పరిసరాల శుభ్రతతో అంటు వ్యాధులకు దూరం

**చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త**

పరిసరాల శుభ్రతతో అంటు వ్యాధులకు దూరంగా వుండవచ్చునని వైద్యాధికారిణి మోనా అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా వుందన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలనీ, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. దోమలు, ఈగల వల్ల వచ్చే వ్యాధులు, కాలానుగుణంగా పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## విస్తృత వాహనాలు తనిఖీ చేపట్టిన ఎస్ఐ

**సిద్ధవటం జనవరి,27 ప్రభాతవార్త.**

కడప, బద్వేల్ ప్రధాన రహదారి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపాన మండల ఎస్సై మహమ్మద్ రఫీ వాహనాలు తనిఖీ చేపట్టారు మండలంలోని, సిద్ధవటం, బద్వేల్ ప్రధాన రహదారి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపాన మంగళవారం సాయంత్రం మండల ఎస్సై మహమ్మద్ రఫీ వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహన దారునికి హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తప్పవని, ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్యా యత్నం

**మదనపల్లెక్రైమ్, జనవరి 27 ప్రభాతవార్త.**

అనారోగ్యంతో ఓ విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రుల కథనం మేరకు పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన మస్తాన్ కుమారుడు మహమ్మద్ ముజిబుల్ స్థానికంగా ఉన్న ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రులలో చికిత్సలు చేయించుకున్న నయం కాకపోవడంతో మనస్థాపంతో వాస్మాల్ ఆయిల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నతస్థానం




**బద్వేల్ అర్బన్ జనవరి 27 ప్రభాతవార్త :**

ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని మండల ఎంఈఓ డి.ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాలని, చదువుతోనే ఏదైనా సాధించవచ్చని, మనిషి మనుగడకు చదువు, సంస్కారం ఎంతో అవసరమని సూచించారు. మార్చి మాసంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని విద్యార్థులు చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అందుకు తగ్గట్టుగానే తన ఆలోచన, తపన ఉండాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాల పూర్వ తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయ కుమార్ మాట్లాడుతూ ఈ సమయం విద్యార్థులకి అత్యంత విలువైన సమయమని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా చదువే లక్ష్యంగా పూర్తి సమయాన్ని కేటాయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు టి.వి.సుబ్బారావు, చిన్నకేశంపల్లె ఉపాధ్యాయులు రాజ్ కుమార్ రెడ్డి, కె.శివ ప్రసాద్, పి.సుబ్బరాయుడు, జి.రవీంద్రా రెడ్డి, ఎస్. గౌస్ బాషా, వై.రామ మోహన్, సి.వి.రమణయ్య, పీరాన్ సాహెబ్, అపరపు న్నీసా, ఎస్.శోభారాణి, సి.హెచ్.సాగర్, జి.అరుణ్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రాజేశ్వరి, గ్రామ పెద్దలు జయరామి రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## మండల టిడిపి అధ్యక్షుడిగా వై,వెంకటసుబ్బారెడ్డి

**చాపాడు. జనవరి 27. ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ చాపాడు మండల నూతన అధ్యక్షుడిగా, వై. వెంకట సుబ్బారెడ్డిని శాసనసభ్యులు పుట్టా సుధాకరయాదవ్ నియమించారు. మండల అధ్యక్షుడుగా ఉన్న అన్నవరం సుధాకర్‌రెడ్డి ఏపీ ఎస్సి డిసి డైరెక్టర్గా నియమితులు కావడంతో ఆయన స్థానంలో సోమాపురం గ్రామ పంచాయతీ నాగాయ పల్లెకుచెందిన, వై.వెంకట సుబ్బారెడ్డి టిడిపి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి తన వంతు శాయశక్తులకృషి చేస్తానని తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**లకిరెడ్డిపల్లి జనవరి 28 ప్రభాతవార్త**



సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీం ఆధ్వర్యంలో అనంతపురం హరిజనవాడలో శక్తి టీం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఫోన్ కాల్ తీయకూడదని ఒకవేళ ఫోన్ కాల్ తీసిన వెంటనే ఓటీపీ ఆధార్ నెంబర్లు చెప్పకూడదన్నారు. అంతే కాకుండా గ్రామాలలో వ్యక్తిగత కక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ప్రతి ఒక్కరు అన్యోన్యంగా కలిసి ఉండాలన్నారు. అలాగే మద్యం సేవించి అన్నలు సృష్టించిన వెంటనే కఠించినట్లు తప్పమన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం, విద్యాసాగర్ రెడ్డి పకీరమ్మ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి జనవరి 27 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థచే నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2026, 27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి నుండి ఇంటర్ మొదటి ఏడాది లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 21వ తేదీ నుండి ఫిబ్రవరి 19వ తేదీ వరకు అప్లై చేయవలెను http://apbrgcet.apcfss.in అనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలనీ పాఠశాల ప్రిన్సిపల్ విజయ తెలిపారు.

## సేవా దృక్పథానికి గౌరవం

**నందలూరు, జనవరి 27 ప్రభాతవార్త :**



మానవసేవే మాధవసేవ అనే భావనతో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నందలూరుకు చెందిన కుర్రామణి యాదవ్‌కు చానియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం అభినందనీయం. ఇది వ్యక్తిగత సాధనకే కాకుండా సేవా దృక్పథానికి లభించిన గుర్తింపుగా నిలిచింది. సమాజానికి అవసరమైన ప్రతి సేవా కార్యక్రమంలో ముందుండే కుర్రామణి యాదవ్, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ చిరునవ్వుతో స్పందించడం ఆయన ప్రత్యేకత. ఈ సందర్భంగా నందలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆయనను ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గురు ప్రసాద్, సర్పంచ్ మాడపోతుల రాము, వార్డ్ మెంబర్ రవిశంకర్, రైల్వే గంధం గంగాధర్, సునీల్ రెడ్డి, ఆనాల మధు, గుండు సురేష్, ఉమ్మడిశెట్టి రమేష్ తదితరులు పాల్గొని కుర్రామణి యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కుర్రామణి యాదవ్ మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లి వినాయక స్వామి గుడి సమీపంలో కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్‌తో కూడిన చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**యర్రగుంట్ల : జనవరి 27 ప్రభాతవార్త:**



పశువైద్యశిబిరాలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని యర్రగుంట్ల పశు వైద్యాధికారి మున్నయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కోడూరు, పెద్దనపాడు లో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా డాక్టర్ మున్నయ్య మాట్లాడుతూపశు ఆరోగ్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో ఉచిత పశు వైద్యులచే ఉచిత వైద్యంతో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. గొర్రెలకు ఉచితంగా బొబ్బ వ్యాధి నివారణ టీకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగులకు పని భారాన్ని కల్పించాలని డిమాండ్

**పీలేరు జనవరి 27 ప్రభాతవార్త:**




బ్యాంకు ఉద్యోగులకు పని భారాన్ని తగ్గించి, పని ఒత్తిడి నుంచి నివృత్తి కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరమ్ అఫ్ బ్యాంక్ యూనియన్ల దేశ వ్యాప్త సమ్మె పిలుపుతో పీలేరు పట్టణ పరిధిలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ మేనేజర్ కార్తీక్ భరద్వాజ్ మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు ఎంతోకాలంగా అధిక పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, పరిస్థితిని అర్థం చేసుకుని వారానికి 5 రోజులు పనిదినాలను ప్రకటించి, బ్యాంక్ ఉద్యోగులకు పని భారం నుంచి కొంతైనా ఉపశమనం పొందేలా సహకరించాలని విజ్ఞప్తి చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ యూనియన్ సెక్రటరీ సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి శనివారం సెలవు దినాలుగా ప్రకటించాలని, ఆ రోజు బ్యాచ్ పనిగంటలు మిగతా రోజులకు కలపాలంటూ, ఇందుకు సంబంధించిన ఒప్పందం కుదిరినప్పటికీ ప్రభుత్వం చాలా కాలంగా అందుకు తగిన అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ సమ్మెలో భారతీయ స్టేట్ బ్యాంక్ నుంచి సోమేశ్వర రావు, బెబో రావు, శిరీష, యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు వేణు, కుమార్, ఇండియన్ బ్యాంక్, గ్రామీణ బ్యాంక్, డీసీసీబీ బ్యాంక్ ఉద్యోగులు తదితరులు పాల్గొని సమ్మెకు తమ సమ్మతిని తెలియచేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అభివృద్దే ప్రధాన లక్ష్యం

**మదనపల్లె, జనవరి 27 ప్రభాతవార్త:**


రోడ్డ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అభివృద్దే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం రూరల్ మండలంలోని కోటవారిపల్లె పంచాయితీ బండకిందపల్లి అడవిలోపల్లి మీదుగా బొమ్మనచెర్వు వరకు రూ.3.50కోట్లతో సిసిరోడ్లు, బిటి రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఉంటే ప్రజలకు అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో సిసిరోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, ఆర్‌అండ్‌బి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే తధ్యంగా పనిచేయాలి

**మదనపల్లె, జనవరి 27 ప్రభాతవార్త:**


నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే తథ్యంగా పనిచేయాలని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు తెలిపారు. మంగళవారం ఆయన నివాసం వద్ద ఇటీవల టిడిపిలో నియామకమైన పట్టణ,రూరల్ మండల అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కొత్తగా నియామకమైన నాయకులు పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేయలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ టిడిపిలో కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం లభించడం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణ, మండల టిడిపి అధ్యక్షులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాదేళ్ళ అరుణ్ తేజ్(చింటూ), రూరల్ అధ్యక్షులు శ్రీనివాసులు, రామసముద్రం అధ్యక్షులు విజయగౌడ్, టిడిపి మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.ఎ.మస్తాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకాపా హయాంలో హిందూ ఆలయాలు నిర్వీర్యం

**మదనపల్లె, జనవరి 27 ప్రభాతవార్త :**


మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

గత వైకాపా ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలు నిర్వీర్యం చెందాయని తిరుమల-తిరుపతి దేవస్థానం బోర్డు పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హిందు వ్యతిరేక పాలన చేశారన్నారు. హిందూ దేవాలయాల అభివృద్ధికి ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. పరకామణిలో కూడా భారీ ఎత్తున చోరీ చోటుచేసుకుంటే చిన్న ఘటన అంటూ వైకాపా నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో జగన్ చేపట్టిన పాదయాత్రలో రావాలి జగన్, కావలి జగన్ అనే నినాదంతో ఒక్కసారి ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాని అదోగతి పాలు చేశారన్నారు. జగన్ తలకిందల తపస్సు చేసినా ఇక అధికారంలోకి వచ్చేది కలే అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, పార్లమెంటు కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, ఓసూరి కిరణ్‌కుమార్, బండి ఆనంద్, బర్నేపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాట కార్యక్రమంను విజయవంతం చేయండి

**మదనపల్లె క్రైమ్ జనవరి 27 ప్రభాతవార్త.**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధ్యాయ వర్గానికి ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో లోని ఆర్థిక అంశాల హామీలను నెరవేర్చుకోవటం కోసం చేస్తున్న దసల వారి పోరాటాన్ని విజయవంతం చేయాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్ లు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 20 మాసాలు గడిచిన ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ఎస్ టి యు నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 30వ తేదీన తాసిల్దార్ వినతిపత్రాలు సమర్పణ, ఫిబ్రవరి 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా, ఫిబ్రవరి 25న ఛలో విజయవాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలనన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగస్తులను మోసం చేస్తూ కల్లబొల్లి మాటలతో వారి పని చేయించు కొంటున్నారే తప్ప ఉద్యోగుల సంక్షేమమం ఏమాత్రం పట్టించుకోలేదనన్నారు. ఉద్యోగుల సత్తా ప్రభుత్వానికి తెలియాలంటే అందరూ పోరాటంలో పాల్గొని నిరసన గలాన్ని వినిపించాలన్నారు.

## మల్లయ్య కొండ భక్తుల సేవకు కలిసి నడుద్దాం

**తంబళ్లపల్లె జనవరి 27 ప్రభాతవార్త ః**



మండల కేంద్రం సమీపంలోని మల్లయ్య కొండలో జరిగే మహాశివరాత్రి పర్వదినాన తరలివచ్చే వేలాది మంది భక్తులకు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు వాలంటీర్లుగా స్వచ్ఛందంగా సేవ చేద్దామని ఉమ్మడి నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని టిడిపి నాయకులు సమావేశమై మహాశివరాత్రి జరిగే బ్రహ్మోత్సవాలలో ప్రతి టిడిపి నాయకుడు, కార్యకర్త ప్రజాసేవకు అంకితం కావాలని, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ హాజరై మల్లయ్య కొండ ప్రతిష్ఠ ఇనుమడింప చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంకేతిక సాగుతో మామిడిలో అధిక దిగుబడి

**నందలూరు , జనవరి 27 ప్రభాతవార్త :**



మారుతున్న సాగు పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక, సాంకేతిక పద్ధతులను అవలంబించినప్పుడే మామిడి సాగులో ఆశించిన దిగుబడులు, లాభాలు సాధ్యమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. మండలంలో మామిడి రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాటూరు, ఆడపూరు, నల్లతిమ్మయపల్లి గ్రామాల్లో నిర్వహించిన శిక్షణలో ప్రస్తుత దశలో మామిడి తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య చర్యలు, చీడపీడల నియంత్రణపై రైతులకు స్పష్టత కల్పించారు. ప్రభుత్వ రాయితీలతో అందుబాటులో ఉన్న ఫ్రూట్ కవర్ల వినియోగం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. పూత సమానంగా రావడానికి అవసరమైన పిచికారీ విధానాలు, పురుగు నివారణ చర్యలపై శాస్త్రీయ సూచనలు అందించారు. తెల్ల పూత దశలో రసాయనాల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని, తేనె మంచు పురుగు వంటి తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి నేరుగా సలహాలు ఇవ్వడం ద్వారా రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని పాల్గొన్న రైతులు అభిప్రాయపడ్డారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు సాగు లాభదాయకతను పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన.

**తంబళ్లపల్లె జనవరి 27 ప్రభాతవార్త ః**



ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తిరుపతి రమాదేవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందం సుమారు 100 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపూజీ పట్నాయక్,వక్తలు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి సహకరించిన తిరుపతికి చెందిన జర్నలిస్ట్ చంద్రశేఖర్ ను రమాదేవి హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలతో మారుమూల గ్రామాలలో నిరుపేదలకు వైద్యం అందించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అధికారులు,వాలంటీర్లు, టిడిపి, కూటమి నాయకులు, ప్రజలకు రమాదేవి హాస్పిటల్స్ యాజమాన్యం, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**ముద్దనూరు, జనవరి 27,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొసినేపల్లె గ్రామ సమీపంలో 22 గురువారం నాడు కొర్రపాడు గ్రామానికి చెందిన సంజీవ్ గొర్రెలను కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తీసుకొని వెళుతుండగా వాహనం పైనుంచి ప్రమాదవశాత్తు క్రిందపడి తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం నాడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు, ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## మండల టిడిపి అధ్యక్షునిగా చెన్నుపల్లి..

**బ్రహ్మంగారిమఠం జనవరి 27 ప్రభాతవార్త:**



బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడుగా రెండవ సారి చెన్నుపల్లి సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఏకగ్రీవంగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా చెన్నుపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి రెండవసారి తనను బ్రహ్మంగారి మఠం మండల టిడిపి అధ్యక్షునిగా నియమించినందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు మరియు బి మఠం మండల టిడిపి నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.మండల టిడిపి నాయకులకు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపితం చేసేందుకు తన వంతు సాయ శక్తుల కృషి చేస్తానని చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలియజేశారు, ఈ కార్యక్రమం లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి,సింగిల్ విండో ప్రెసిడెంట్ యల్లటూరు సాంబ శివారెడ్డి, పూజ శివయ్య యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీను, మేకల సుధాకర్, పుటాల శివ, లగసాని నాగరాజు, లింగందిన్నే ఓబుల్ రెడ్డి, గంగిరెడ్డిపల్లి సూరి, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన, ఏఎస్పి

**సిద్ధవటం, జనవరి 27 ప్రభాతవార్త:**

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు నిలుపుదల చేసే పార్కింగ్ ప్రదేశాలను ఏఎస్పి, మనోజ్ కుమార్ హెగ్డే మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి, నెల, 14,15,16, తేదీలలో 3 రోజులు పాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలు నిలుపుదల చేసేందుకు 6 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించామని పంచలింగాల గుడి వద్ద పోలీస్ కంట్రోల్ ఏర్పాటు చేసి కాలినడకన వెళ్లే మార్గంలో కొన్ని ప్రదేశాలలో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా తగు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేసే వద్ద భక్తులు దిగేటప్పుడు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా పెట్టుకోవాలని తెలిపారు సన్నిధానంలో భక్తులు క్యూ లైన్ లో వచ్చి ప్రతి ఒక్కరూ దర్శనం చేసుకోవాలని, వృద్ధులు వికలాంగుల కు సూచించిన ప్రదేశాలలో వెళ్లాలని తెలిపారు, ఆలయ సంప్రదాయాలతో ఆయనకు ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరాజు, ఎస్సై మహమ్మద్ రఫీ, డిప్యూటీ రేంజర్, ఓబులేసు, ఆలయ చైర్మన్, జంగిటి రాజేంద్రప్రసాద్, ఎండోమెంట్ సిబ్బంది చంద్ర, ఫారెస్ట్ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.



# వైభవంగా మల్లెం కొండేశ్వర స్వామి గొడుగు గిరి ప్రదక్షణ

స్వామివారి గొడుగు గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,ఆర్డిఓ





**బద్వేల్ అర్బన్ జనవరి 27 ప్రభాతవార్త :**

గోపవరం మండలంలో వెలసిన శ్రీ అంకాలమ్మ సమేత మల్లెం కొండేశ్వర స్వామి దేవాలయం తిరుణాల ఫిబ్రవరి 15వ తారీఖున వైభవంగా ప్రారంభం కానుంది, గత మూడు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దబోయిన ప్రసాద్ రెడ్డి పలువురు నాయకులు చేతుల మీదుగా మల్లెం కొండేశ్వర స్వామి గొడుగు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వారి గిరి ప్రదక్షిణం మహోత్సవ కార్యక్రమం బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం, బద్వేల్, మర్రిపాడు, అనంతసాగరంలోని మండలాలలోని సుమారు 54 గ్రామాలు ఒక మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిది రోజులు పాటు స్వామి వారి గొడుగు గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దేవదాయ శాఖ ఈవో రామలింగారెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మిరియం మల్లెం కొండయ్య యాదవ్, సెక్రటరీ కొడమల మహిలతతో పాటు పలువులు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం అంకాలమ్మ సమేత మల్లెం కొండేశ్వర స్వామి గొడుగు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నెల్లూరు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆర్డిఓ చంద్రమోహన్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు, వారికి ఆలయ ప్రాంగణంలో ఈవో రామలింగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను అందజేశారు, అలాగే అక్కడనుండి స్వామి వారి గొడుగు నాలుగు రోడ్లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెం కొండేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మిరియం కొండయ్య యాదవ్ మాట్లాడుతూ బ్రాహ్మణ పల్లె, రామాపురం, నిరుద్రాయ పల్లె, ఎల్లారెడ్డిపేట, రాఛాయాపేట, అగ్రహారం, చెన్నారం, బెడుసు పల్లె,వీరారెడ్డి నగర్, కొత్త శెట్టి వారి పల్లె, గోపవరం, శ్రీనివాసపురం మరియు బద్వేల్ మున్సిపాలిటీ పరిధి అలాగే మర్రిపాడు, అనంతసాగర్ మండలాలలో స్వామివారిని గిరిప్రదక్షిణ నిర్వహించి అనంతరం ఫిబ్రవరి 15వ తారీఖున అంగరంగ వైభవంగా స్వామివారి తిరుణాల, కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బద్వేల్ తాసిల్దార్ ఉదయభాస్కర్ రాజు, మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి, టిడిపి మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, సింగం పల్లె శివయ్య స్వామి, రామ్మూర్తి నాయుడు, పెరుగు వెంకటయ్య, మిత్తి కాయల రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, వైసిపి మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి సుందరరామిరెడ్డి, స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, తులశి వెంకట శివ నారాయణ, కిషోర్ చ్నిదుకూరి హనుమంతు, ప్రసాద్, గోపవరం ఎంపీపీ ధనలక్ష్మమ్మ, మామిడి సుధాకర్, వల్లెల శివశంకర్ రెడ్డి,యల్లారెడ్డి, రామ్మోహన్ రెడ్డి,నిమ్మకాయల గోపాల్ రెడ్డి, బోవిల్ల యానాద రెడ్డి, అరవ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి,మల్లిఖార్జున, మరియు పలువురు భక్తులు కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**ఒంటిమిట్ట జనవరి 27 ప్రభాతవార్త**



ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు మంగళవారం వీడ్కోలు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మండల విద్యాశాఖ అధికారి వల్లూరు. బ్రహ్మయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఒంటిమిట్ట ,రాచపల్లి పాఠశాలలకు ఆయన హాజరై విద్యలో సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. పదవ తరగతి పరీక్షల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ,ఉత్తీర్ణత పొందిన తర్వాత ఎటువంటిపై చదువులు చదవాలి, ఏ విధంగా ఉద్యోగాలు సంపాదించుకోవాలన్న అంశాల పైన ప్రత్యేకంగా చర్చించారు. పరీక్షల సమయంలో మానసిక శాంతి అవసరం అన్నాడు. ఒత్తిడిలకు లోను కావద్దన్నాడు. అధ్యాపకులు విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల స్కాలర్ నాన్సీకి డాక్టరేట్

**ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 27 ప్రభాతవార్త**



యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ శాఖ స్కాలర్ చిలమకూరు నాన్సీకి వైవియూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆ శాఖ ఆచార్యులు డాక్టర్ ఎస్ కిరణ్ పర్యవేక్షణలో "దోసకాయ, ద్రాక్ష ఆకుల వ్యాధి గుర్తింపు కోసం యంత్ర అభ్యాస అల్గోరిథంల అభివృద్ధి అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా చిలమకూరు నాన్సీ రాసిన థీసిస్ డాక్టరేట్ నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు స్కాలర్ చిలమకూరు నాన్సీకి పీహెచ్డీ నోటిఫికేషన్‌ను ప్రకటించారు. నాన్సీ రాసిన పరిశోధన పత్రాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆమెను వైస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యా జి.జయచంద్ర రెడ్డి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ శాఖ అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

## ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

**లక్కిరెడ్డిపల్లి జనవరి 28 ప్రభాతవార్త**

మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్ ప్రధానోపాధ్యాయుడు సైతం గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దేవులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటాలు, నాటకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ తేడాది దేవలంపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల మండల ఫస్టు వచ్చిందని ఈ ఏ డాది కూడా 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించి మండలంలో ఒకటో స్థానంలో నిలవాలని వారు కోరారు అంతేకాకుండా స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉన్నారని అలాగే విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని వారన్నారు ప్రతి ఏటా మంచి ఫలితాలతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సన్మానం

**పీలేరు జనవరి 27 ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా నిమ్మనపల్లి పురుషోత్తం దుశ్శాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రతి సామాన్య కార్యకర్తను గుర్తిస్తుంది అనేదానికి ప్రత్యక్ష నిదర్శనమై ఈరోజు భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కార్యదర్శిగా పురుషోత్తం నియామకమని వారు చేసిన నిబద్ధత నిజాయితీ పార్టీ పట్ల వారి విధానాలే ఈరోజు మారుమూల ప్రాంతంలోని దళిత సామాజిక వర్గానికి చెందినటువంటి వ్యక్తికి రాష్ట్రస్థాయిలో భారతీయ జనతా పార్టీ బాధ్యత కల్పించడం అని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది పార్టీ కోసం పార్టీ ఎదుగుదలకు తమ వంతు కృషి చేయాలని ప్రతి కార్యకర్త పార్టీయే ప్రధానంగా పనిచేసే పార్టీ ఎదుగుదలకు పాటుపడాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి పులి నరేంద్రకుమార్‌రెడి ఎల్లంపల్లి ప్రశాంత్, డాక్టర్ అజ్మతుల్లాఖాన్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యం కోసం సీఎంఆర్ఎఫ్

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జనవరి 27 ప్రభాతవార్త**

ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ద్వారా నిరంతరం సహాయం చేస్తున్నామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే జగన్మోహన్ రాజు వెళ్లి అందజేశారు. 3.20 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అనారోగ్య సమస్యలు,ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా చేయూతను ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందని తెలియజేశారు.అదేవిధంగా అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనాన్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## యునైటెడ్ ఫోరం అఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో ర్యాలీ



**ప్రొద్దుటూరు జనవరి 27 ప్రభాతవార్త**

బ్యాంకులకు వారంలో ఐదు రోజులు తన దినాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు బ్యాంకు ఉద్యోగులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ రోడ్డు లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ నుండి గాంధీ విగ్రహం గుండా మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా వరకు పెద్ద ఎత్తున అనినాదాలు చేస్తూ బ్యాంకు ఉద్యోగులు ర్యాలీ కొనసాగించారు. అనంతరం యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు విపరీతమైన ఒత్తిడి కారణంగా గతంలో ఐదు రోజులే పని దినాలు కల్పించాలని కోరగా 2024లో అనుమతి వచ్చిన ఈ అంశం ప్రభుత్వం దగ్గర పెండింగ్లో ఉందన్నారు. ఈ అంశాన్ని తక్షణమే ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనికిరాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ప్రతి శనివారం సగం రోజు పనిచేసేవారమని తెలిపారు. ప్రస్తుతం రెండు శనివారాలు సెలవు ప్రకటించారని మరియు రెండు శనివారాలు పూర్తి బ్యాంకింగ్ సేవలు జరుగుతున్నాయని తెలిపారు దీనివల్ల మాకు ఒరిగిందేమీ లేదని అదే ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. బ్యాంకింగ్ సేవలను వారంలో ఐదు రోజులు పని దినాలుగా ప్రకటిస్తే మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు రోజుల పని దినాలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్ ధారా వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరించండి.

**తంబళ్లపల్లె జనవరి 27 ప్రభాతవార్త ః**



మండలం కోసువారిపల్లి పురాతన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి సహకరించాలని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డిని కూటమి నాయకులు కోరారు. మంగళవారం టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డిని కోసువారిపల్లి స్వామివారి బ్రహ్మోత్సవాలకు టిటిడి అధికారులు, కూటమి నాయకులు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల నిర్వహణ, భక్తులకు అందుతున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. టిటిడి ఆలయానికి సంబంధించిన సమస్యలను టిటిడి బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తూ బ్రహ్మోత్సవాల నిర్వహణలో అధికారులు, అర్చకులు, స్థానిక నాయకులు చేసిన కృషిని కొనియాడారు. బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సేవలే మనకు నిజమైన ప్రశంసలు

**తంబళ్లపల్లె జనవరి 27 ప్రభాతవార్త ః**

విద్యుత్ శాఖ సిబ్బంది అంకితభావంతో రైతులు, వినియోగదారుల సేవలే మనకు నిజమైన ప్రశంసలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని డి.ఈ గంగాధరం సూచించారు. ఈ సందర్భంగా కన్నెమడుగు సబ్ స్టేషన్‌లో 11 కెవి విద్యుత్ రూరల్ ఫీడర్ ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి గోవిందరెడ్డి,ట్రాన్స్ఫార్మర్ డిఈ విజయ భాస్కర్, ఏ.డి ఆదినారాయణ, టిఆర్ఎ2 రమణారెడ్డి, ఏఈలు సురేంద్ర, సుబ్బయ్య, శేషు, లైన్ ఇన్స్పెక్టర్లు భాస్కర్, నాగరాజు, లైన్మెన్ శంకర, నాగేంద్ర, ఆయాజ్, నవాజ్, ఇంతియాజ్, నాగేంద్రబాబు, శేషు, కాలేశా, రమేష్, సురేష్, ప్రవీణ్, రాజశేఖర్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## చింతచెట్టు నుంచి పాలు

**పుంగనూరు రూరల్ జనవరి 27 ప్రభాతవార్త :**



పట్టణంలోని ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఓ చింత చెట్టు నుంచి పాల వంటి ద్రవం వెలువడటం స్థానికులలో ఆసక్తిగా మారింది. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థులు, సిబ్బంది వెంటనే ఇతరులకు తెలియజేయడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారు. చెట్టు నుంచి పాలు వస్తున్నాయంటూ ప్రచారం జరగడంతో ప్రజలు క్యూ కట్టి వీక్షించారు. ఇది వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో పేర్కొన్న సంఘటనలలో ఒకటిగా కొందరు భావించారు. ఇది దైవ సంకేతంగా భావించి పలువురు పూజలు నిర్వహించారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**పులివెందుల , జనవరి 27 ప్రభాత వార్త :**



నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారంపై మంత్రి కొల్లు రవీంద్రని, పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మరియు మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ భేటీ సందర్భంగా నియోజక వర్గ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, పులివెందుల నియోజక వర్గంలో గనులు, భూగర్భ వనరుల శాఖకు సంబంధిం చిన అనేక సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతు న్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు సంబంధించిన పలు అంశాలు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి, ప్రజలకు ఊరట కలిగించాలని ఆయన కోరారు.దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీటెక్ రవి ప్రస్తావించిన ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి, యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

## వరహా ఆంజనేయ స్వామి రథోత్సవం

**నందలూరు, జనవరి 27 ప్రభాతవార్త :**



నూకినేని పంచాయతీ పరిధిలోని కుంపిణీపురంలో వెలసిన శ్రీ వరాహా ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవం భక్తుల హృదయాలను ఆకట్టుకుంది. పూలతో సుందరంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు తీరగా గ్రామాలు భక్తి మయంగా మారాయి. రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వచ్చిన జాగీర్దారుల వంశస్థులు రథాన్ని లాగడం సంప్రదాయ వైభవానికి ప్రతీకగా నిలిచింది. రథాన్ని లాగేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. కుంపిణీపురం, మిద్దెల, బలిజపల్లి గ్రామాల మీదుగా సాగిన ఊరేగింపు బాణాసంచా, డప్పు వాయిద్యాలు, రంగుల చల్లింపులతో కన్నుల పండువగా కొనసాగింది. ఉదయం ఆలయంలో నిర్వహించిన పుణ్యాహావాచనాలు, అభిషేకాలు భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలు మానవీయ విలువలకు నిదర్శనంగా నిలిచాయి. భక్తులు పెద్ద ఎత్తున రథోత్సవం లో పాల్గొని జయప్రదం చేశారు.

## విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి




క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

**మదనపల్లె, జనవరి 27 ప్రభాతవార్త:**

విద్యార్థులు క్రీడారంగంలో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 27వరకు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టియు అనంతపురం ఆధ్వర్యంలో అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు ఎంపిక కార్యక్రమం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టులో ఎంపికైన విద్యార్థులు ఈనెల 29నుంచి ఫిబ్రవరి 5వరకు మైసూర్‌లోని జేఎస్ఎస్‌సైన్స్ అండ్ టెక్నాలజీస్‌లో జరగబోయే క్రికెట్ పోటీల్లో జేఎన్‌టియు టీమ్‌లోని 16మంది విద్యార్థులు ఇద్దరు కోచ్‌లు పాల్గొంటారన్నారు. ఆ పోటీల్లో గెలుపొందాలని ఆకాక్షించారు.

## విద్య యొక్క విలువను గుర్తించండి

**పోరుమామిళ్ల రూరల్, జనవరి 27 ప్రభాతవార్త:**

కాశినాయన మండలం నరసాపురం మోడల్ స్కూల్ లో మంగళవారం ఫేర్వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అధైర్య పడకుండా ధైర్యంగా ఒక దృఢ సంకల్పంతో పరీక్షలు రాసి కన్న తల్లిదండ్రులకు పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను అభివృద్ధి చేసేందుకే రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకొని విద్యావ్యవస్థలో నూతన వరవడులు సృష్టిస్తూ విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే విజయం సాధించిన వాళ్ళమవుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి మంచి గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలను సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లా, రాష్ట్ర,దేశ ఉన్నతాధికారులుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఇటీవల మోడల్ స్కూల్ ను సందర్శించి మౌలిక వసతులు లేవని గుర్తించి వెంటనే వాటి పరిష్కారం చూపమన్నారు. అతి త్వరలో విద్యార్థులకు సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ షఫీ, ప్రిన్సిపాల్ సౌజన్య, స్థానిక టిడిపి నాయకులు పోలిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శంకర్,విద్య కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## వైసీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి

టిడిపి సీనియర్ నేత ఆర్.జె.వెంకటేష్ హితవు

**మదనపల్లె జనవరి 27 ప్రభాతవార్త**



వైసీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని, రాజకీయాలలో హుందాతనం ఎంతో అవసరమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్ నందు గల టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ ఇటీవల మదనపల్లె పట్టణానికి చెందిన కొందరు వైఎస్సార్సీపీ నాయకులు టిడిపి నాయకులు,ఎమ్మెల్యే షాజహాన్ బాషాపైన అనవసర వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ముఖ్యంగా సుదీర్ఘంగా రాజకీయాలలో అనుభవం కలిగిన మాజీ ఛైర్ పర్సన్ షమీం అస్లాం ఎమ్మెల్యే జనరల్ ఫండ్ 40 కోట్లు ఏమిటి 400 కోట్లు తీసుకొస్తాననే వ్యాఖ్యలపై హేళనగా మాట్లాడడం సబబు కాదన్నారు.తాము మున్సిపాలిటీ పరిధి పెరగడంతో మౌలిక సదుపాయాల కల్పనకు కొంత వెనుకబడిన మాట వాస్తవమేనని, అయినప్పటికీ కాంట్రాక్టర్ల ద్వారా ఉన్న నిధులతోనే మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే శివకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిమ్మనపల్లె మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి గణపతి,కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ బద్దెల రాజన్న,గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున,ఉపాధ్యక్షుడు గోపాల్, రామచంద్ర నాయుడు,ఒట్టికొండ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## కడపలో ఈడిగ భవన్ నిర్మాణానికి 50 సెంట్లు ప్రభుత్వ భూమి

**రాజంపేట, జనవరి 27 ప్రభాతవార్త**



జిల్లా కేంద్రమైన కడప పట్టణంలో ఈడిగ కులస్తులకు ఈడిగ భవం నిర్మాణానికి గాను ప్రభుత్వం నుంచి 50 సెంట్ల భూమిని కేటాయించాలని రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నర్సయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రమైన కడపలో బలిజ భవన్ నిర్మాణానికి 50 సెంట్లు కేటాయించిందని అదేవిధంగా కూడా ఈడిగ భవన్ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కు జిల్లా ఈడిగ సంఘం తరపున లేఖ రాస్తామని తెలిపారు. జిల్లాలో ఈడిగ సామాజిక వర్గానికి చెంది ఆరు లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. అందుకు సామాజిక వర్గమంతా ఏకతాటిపై నిలిచి ఈడికి భవన్ స్థలం కేటాయింపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అసాంఘిక కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్



**కడప క్రైం, జనవరి 27, ప్రభాతవార్త:**

కడప నగరంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల సేవనం, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన సేవనం వంటి వాటిని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కడప రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. రిమ్స్ పీఎస్ పరిధిలోని చలమారెడ్డిపల్లి, శివాలయం, టిడ్కో ఇళ్లు, సింగపూర్ టౌన్‌సిప్, రైల్వే వంతెన కింద, నగర వనం తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ తెలిపారు.

## పూర్వ విద్యార్థి స్కాలర్షిప్

**కడప , జనవరి 27, ప్రభాతవార్త:**



2004లో కెఎస్ఆర్ఎం కాలేజ్ నుండి ఎలక్ట్రికల్ విభాగం లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి గోపిరెడ్డి దత్తాత్రేయ రెడ్డి కళాశాల చదువుతున్న విద్యార్థులకు స్కాలర్షిప్ ప్రకటించారు.విద్య ద్వారా జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని కష్టపడి క్రమశిక్షణతో పనిచేయాలని తనకు ఎప్పుడూ ప్రోత్సహించేవారని దత్తాత్రేయ రెడ్డి తెలిపారు. నిరంతర కృషి శక్తిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకండి. ఈ రోజు మీరు పొందే అనుభవాలే మీ విజయానికి పునాది అవుతాయి" అని సూచించారు. ఈ కార్యక్రమ ముఖ్య నిర్వాహక అధికారి కాలేజ్ అలుమ్ని డీన్ ప్రొఫెసర్ ఎన్ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ సహాయం మీ కష్టానికి , క్రమశిక్షణకు కొలమానం అని, మీ నిరంతర కృషి నీ ఎప్పుడూ తక్కువ అంచనా వేయకండి, భవిషత్తులో మీరు కూడా మీ శక్తి కొలది ఎలాంటి సహాయ సహకారాలు చేయాలని గుర్తు చేశారు. కార్యక్రమాంతంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్, ఇఇఇ విభాగం అధిపతి మరియు ప్రొఫెసర్లకు ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఘనంగా జాతీయ ఎలక్ట్రీషన్ డే వేడుకలు

**పుంగనూరు రూరల్ జనవరి 27 ప్రభాతవా**

జడ్పీ హాల్ ఆవరణలో మంగళవారం జాతీయ ఎలక్ట్రిషన్ డే ను ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు హాజరై ఎలక్ట్రిషన్ల సేవలను ప్రశంసించారు. విద్యుత్ రంగ అభివృద్ధిలో ఎలక్ట్రిషన్ల పాత్ర అనన్యసాధారణమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎలక్ట్రిషన్ సంఘ జెండాను ఎగురవేసి జాతీయ ఎలక్ట్రిషన్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు పాల్గొన్నారు.

